# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 22-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 18 | పేజీలు:4 | వెల: రూ.1/-


## రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ రాఖీ శుభాకాంక్షలు

హైదరాబాద్ , ఆగష్టు 21:రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ముళ్లకు అనురాగంతో చేతికి రక్షా బంధనాన్ని కట్టడం గొప్ప సందర్భంగా సీఎం తెలిపారు. రక్షాబంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సహోదరత్వాన్ని మరింతగా పెంచుతుందని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

## హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం: మంత్రి తలసాని

హైదరాబాద్ , ఆగష్టు 21:హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడుపల్లిలో జలమండలి భద్రతా పక్షోత్సవాలకు ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీతోపాటు 190 గ్రామాలకు జలమండలి సేవలు అందుతున్నాయని చెప్పారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆధునిక టెక్నాలజీతో మ్యాన్ హ్యాళ్లలో పూడిక తొలగింపు జరుగుతున్నదని తెలిపారు. 2014కు ముందు తాగునీటి కోసం హైదరాబాద్‌లో నిత్యం ఆందోళనలు జరిగేవని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని చెప్పారు. అప్పటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన డ్రైనేజి, త్రాగునీటి వ్యవస్థ కారణంగానే కొన్ని ఇబ్బందులు ఎదురైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా, డ్రైనేజి వ్యవస్థ అభివృద్ధి జరుగుతుందని మంత్రి అన్నారు.

## బీజేపీ అంటేనే అమ్మకం పార్టీ: ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్ , ఆగష్టు 21: కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడే బీజేపీలోనే అనేక మంది వారసులు ఉన్నారని ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బీజేపీ అంటేనే అమ్మకం పార్టీ అని దుయ్యబట్టారు. విదేశాల నుంచి నల్లధనం తీసుకొస్తామని కేంద్రం మోసం చేసిందని విమర్శించారు. శాసనసభ ఆవరణలోని టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి బాల్క సుమన్‌తో మీడియాతో మాట్లాడారు. పదవుల కోసం పెదవులు మూసుకుని గుజరాతీలకు గులాంగా కిషన్ రెడ్డి మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తెచ్చిందని, రైతు బిడ్డగా చెప్పుకునే కిషన్ రెడ్డి.. ఎనిమిది నెలలుగా ఢిల్లీ శివార్లలో రైతులు ఆందోళన చేస్తున్నా నోరు మెదపడం లేదని విమర్శించారు. తెలంగాణకు ఏం చేస్తారో కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం బీహెచ్ఈఎల్‌కు రూ.25 వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చిందని, కేంద్రం మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్నదని చెప్పారు. ప్రజల ఆస్తులను అంబానీ, అదానీలకు కేంద్రం కట్టబెడుతున్నదని ఆరోపించారు. ప్రధాని మోదీకి ఫొటో తిప్పలు తప్ప పేదల పాట్ల తిప్పలు పట్టడం లేదని విమర్శించారు. ప్యాకేజీల పేర్లతో కేంద్రం ప్రజల చెవుల్లో క్యాబేజీలు పెడుతున్నదన్నారు. కేంద్రం ఏడేండ్లలో 14 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలనీ.. అవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. సామాన్యులను కూడా వదకుండా కేంద్ర ప్రభుత్వం భారాలు మోపుతున్నదని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీజేపీ సర్కార్ కాపీ కొడుతున్నదని వెల్లడించారు. నేరస్తుల అడ్డా బీజేపీ గడ్డ అని, ఇతర పార్టీల్లోని నేరస్తులను బీజేపీలో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో గెలిచే అవకాశమే లేదని, అక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ గెలుపు ఎప్పుడో ఖాయమయిందని స్పష్టం చేశారు.

## జీహెచ్ఎంసీలో కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్‌పై సీఎస్ సమీక్ష

హైదరాబాద్ , ఆగష్టు 21:గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో సోమవారం నుంచి కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై ఇవాళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీలో వందశాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. 10 నుంచి 15 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ కొనసాగనుందని ఆయన తెలిపారు.

ఈ ప్రత్యేక డ్రైవ్ కోసం మొత్తం 175 సంచార టీకా వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 150 సంచార టీకా వాహనాలు.. కంటోన్మెంట్ పరిధిలో 25 మొబైల్ వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సోమేశ్ కుమార్ వివరించారు. జీహెచ్ఎంసీలో 4,846 కాలనీలు, బస్తీల్లో.. కంటోన్మెంట్ పరిధిలోని 360 ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపడతామని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ కోరారు. ఇంటింటికి వెళ్లి టీకాలు వేసుకోని వారిని గుర్తించాలని సిబ్బందికి ఆయన సూచించారు.

## ఢిల్లీలో రికార్డుస్థాయిలో భారీ వర్షం.. ఆరెంజ్ అలెర్ట్

న్యూఢిల్లీ, ఆగష్టు 21: దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఉదయం రికార్డు స్థాయిలో భారీగా వర్షం కురిసింది. దీంతో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఢిల్లీలో శనివారం ఉదయం 139 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. 13 ఏండ్లలో ఆగస్ట్ నెలలో ఒక రోజు అత్యధిక వర్షపాతం ఇదేనని పేర్కొంది. భారీ వర్షం నేపథ్యంలో ఢిల్లీకి ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. మరో రెండు రోజులపాటు ఉరుములతో కూడిన మధ్యస్థాయి నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

కాగా, ఢిల్లీతోపాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) లోని ప్రజలు శనివారం ఉదయం వర్షపు జల్లులతో మేల్కొన్నారు. రోజుల తరబడి ఉన్న ఉక్కపోత, తేమతో కూడిన వాతావరణం నుంచి ఉపశమనం పొందారు.

## ఆఫ్గన్ లో రెచ్చిపోతున్న తాలిబన్లు.. 150 మంది కిడ్నాప్!

ఆఫ్ఘనిస్తాన్ .ఆగష్టు 21: ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబన్ల అరాచకాలు పెరిగిపోతున్నాయి. రెండు రోజులు పాటు శాంతికాముకులుగా నటించిన ముష్కరులు.. తమ అసలు స్వరూపాన్ని క్రమంగా బయటపెడుతున్నారు. తాజాగా కాబుల్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో 150 మంది పౌరులను తాలిబన్లు కిడ్నాప్ చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అఫ్గాన్ నుంచి ఇతర దేశాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నవారిని నిర్బంధించినట్లు తెలుస్తోంది. వారిలో భారతీయుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అఫ్గన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ వార్తల నేపథ్యంలో భారత విదేశాంగ వెంటనే అప్రమత్తమైంది. అపహరణకు గురైన భారతీయులకు తాలిబన్ల నుంచి ఏ ప్రమాదం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## మన సంస్కృతి, వారసత్వం గురించి యువత తెలుసుకోవాలి: వెంకయ్యనాయుడు

హంపి, ఆగష్టు 21: : ఘనమైన సంస్కృతి, వారసత్వాలకు నిలయమైన భారతదేశం గత వైభవం గురించి యువత తెలుసుకోవాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. కర్ణాటక పర్యటనలో ఉన్న ఆయన శనివారం కుటుంబ సమేతంగా చారిత్రక హంపి నగరాన్ని సందర్శించారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఇలాంటి ప్రదేశాల గురించి తెలుసుకోవడం ద్వారా యువతలో మనోబలం, ఆత్మవిశ్వాసం పెరిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కాగలరని ఆకాంక్షించారు.

ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో గుర్తించిన హంపిలో విజయనగర సామ్రాజ్య గతవైభవపు ఆనవాళ్ళు ఉన్నాయన్నారు. మౌనంగా ఉండే రాళ్ళను, చైతన్యంతో కూడిన శిల్పాలుగా మలచిన శిల్పుల కళాచాతుర్యానికి ఈ నగరం నిదర్శనమని, ఇక్కడి ప్రతి రాయి ఓ చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుందని తెలిపారు.

వ్యక్తిగతంగా శ్రీ కృష్ణదేవరాయలును తాను ఎంతో అభిమానిస్తుంటానని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. రాయల కాలంలో అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా, వ్యవసాయం ప్రాధాన్యతను గుర్తించి రైతుల కోసం చెరువులు తవ్వించిన విషయాన్ని గుర్తుచేశారు. సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా ప్రసిద్ధిగాంచిన రాయలు.. అష్టదిగ్గజ కవుల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అద్భుతమైన సంస్కృతి వారసత్వాలకు పుట్టినిల్లు అయిన భారతదేశ చారిత్రక వైభవాన్ని తెలియజేసే ఇలాంటి ప్రదేశాల గురించి భావితరాలకు తెలియజేసేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సూచించారు. ఇలాంటి ప్రదేశాల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. పర్యటనలో భాగంగా హంపిలోని విరూపాక్ష స్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. దేశసౌభాగ్యం, ప్రపంచ శాంతి కోసం స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

## బీజేపీ ఎంపీలు తెలంగాణకు చేసిందేమిటి?: మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , ఆగష్టు 21: రాష్ట్రం నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ఉన్నా ఒక్క జాతీయ ప్రాజెక్టు తేలేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. ఆపార్టీ ఎంపీలు తెలంగాణకు చేసిందేమిటని ప్రశ్నించారు. శాసనసభ ఆవరణలోని టీఆర్ఎస్ ఎల్పీ ఆఫీసులో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయినందుకు సంతోషించినమని, తెలంగాణకు నిధులు తెస్తాడని అనుకున్నామని చెప్పారు. బండి సంజయ్ పిచ్చిపిచ్చిగా మాట్లాడినట్లే కిషన్ రెడ్డి కూడా మాట్లాడుతున్నాడని విమర్శించారు.

కేంద్ర మంత్రిగా ఉండి అబద్దాలు చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణకు గత ఏడేండ్లుగా కేంద్రం ప్రత్యేకంగా ఇచ్చిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కట్టే పన్నుల్లో సగం కూడా తిరిగి ఇవ్వడంలేదన్నారు.

మిషన్ భగీరథను కేంద్రం ఆదర్శంగా తీసుకుందని, అయినా నీతి ఆయోగ్ చిప్పినప్పటికీ భగీరథకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా అమలవుతున్నాయా అని ప్రశ్నించారు. ఇక్కడి సంక్షేమ పథకాలను కేంద్రం ఆదర్శంగా తీసుకుంటున్నదని చెప్పారు. విభజన చట్టంలో ఉన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వలేదని విమర్శించారు. రైతులకు వ్యతిరేకంగా కేంద్రం చట్టాలు చేసిందన్నారు.

## కొనసాగుతున్న రుణమాఫీ నిధుల పంపిణీ.. ఇవాళ 36 కోట్లకుపైగా జమ

హైదరాబాద్ , ఆగష్టు 21: రూ.50వేల లోపు పంట రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 16 నుంచి నిధులు పంపిణీ చేస్తున్నది. ఇవాళ 12,280 మంది రైతుల ఖాతాల్లో.. రూ. 36.29 కోట్లు జమ చేసింది.

ఇప్పటివరకు 63,074 మంది రైతుల ఖాతాల్లో.. రూ.1 72.86 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

రూ. 25 వేల నుంచి రూ.50 వేల లోపు రుణాలున్న రైతులకు రైతుబంధు తరహాలో ఖాతాల్లో సర్కారు నేరుగా నిధులు జమ చేస్తున్నది. తక్కువ మొత్తం ఉన్న వారి నుంచి ప్రారంభించి రూ. 50 వేల వరకు ప్రాధాన్య క్రమంలో నిధులు జమ అవుతున్నాయి. రూ. 50 వేల లోపు రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం 2005.85 కోట్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6, 61,811 మందికి రైతులకు లబ్ధి చేకూరనుంది.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కోసం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల బైక్ ర్యాలీ

హైదరాబాద్ , ఆగష్టు 21: ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేకంగా హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శనివారం షాద్‌నగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్ మున్సిపల్ స్టేడియం నుండి 2 వేల బైక్‌లు పాల్గొన్న ఈ ర్యాలీని షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ విశ్వప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి. లావణ్య, మున్సిపల్ చైర్మన్ నాగేందర్, కౌన్సిలర్లు, తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వ్యవస్థాపకుడు డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, షాద్‌నగర్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కోనేటి రాజు, చీఫ్ కో ఆర్డినేటర్ జి. శ్రీనివాస్ రావు, రవి కుమార్ బిత్తిరి సత్తి, కొమురం, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానమే లక్ష్యంగా ర్యాలీని చేపట్టారు.

రోడ్డు భద్రతను తెలిపే ప్లకార్డులను వాహనదారులు ప్రదర్శించారు. షాద్‌నగర్ మున్సిపల్ స్టేడియం–షాద్‌నగర్ క్రాస్ రోడ్స్– మున్సిపల్ కమిషనర్ కార్యాలయం– లావణ్య హోటల్ యూటర్న్– హాజీపల్లి యూ టర్న్, ఇక్కడి నుంచి తిరిగి షాద్‌నగర్ మున్సిపల్ స్టేడియానికి ర్యాలీ చేరుకోనుంది. షాద్‌నగర్ ఎస్ఐ రఘు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ థీమ్ రైడ్ సేఫ్–రీచ్ సేఫ్. ఈ ఘనత సాధించడంపై తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ షాద్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్ఐ రఘు కుమార్‌కు మెమొంటోను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా బైక్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

## సరిహద్దుల్లో జవాన్లకు రాఖీ కట్టిన ఆడబిడ్డలు

న్యూఢిల్లీ, ఆగష్టు 21:దేశంలో రక్షాబంధన్ సంబురాలు మొదలయ్యాయి. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పహారా కాస్తున్న జవాన్లకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జమ్మూకు సమీపంలోని సుచత్‌గఢ్ ఆక్ట్రాయ్ పోస్టు వద్ద అలాగే త్రిపురలోని అగర్తలలో బీఎస్ఎఫ్ జవాన్లకు శుక్రవారం స్థానిక యువతులు రాఖీలు కట్టారు. ఇక అగర్తలలో కేంద్ర మంత్రి ప్రతిమా భౌమిక్ కూడా బీఎస్ఎఫ్ జవాన్లకు రాఖీ కట్టారు.


చరిత్రలో నేటినిజం



# పరిశోధనల్ని పక్కన పెట్టిన విశ్వవిద్యాలయాలు?.!

విద్య లేని వాడు వింత పశువు అన్న నానుడి మనకు తెలుసు. విద్య అంటే అక్షరాస్యత మాత్రమే కాదు. అక్షరాస్యులందరూ విద్యావేత్తలు కాదు. ఉన్నత విద్య (యునివర్సిటీ డిగ్రీ, పిజి, పిహెచ్‌డి లాంటివి) పూర్తి చేసిన ప్రతిభగల యువతను విద్యావంతుల జాబితాలో చేర్చవచ్చు. ఏ దేశాభివృద్ధి అయినా విద్యావంతుల బలం మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఉన్నత విద్యతో ఉద్యోగ ఉపాధులు, ఆర్థిక స్థిరత్వం, కుటుంబ సంక్షేమం, సంతానాభివృద్ధి, సమాజంలో సముచిత గౌరవం సిద్ధిస్థాయి. దేశంలోని బడుగు యువత విద్యావంతులు అయితేనే అసలైన అభివృద్ధి సుసాధ్యం అవుతుంది. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో కొంత మేరకు అభివృద్ధి సాధించినా అక్షరాస్యత, ఉన్నత విద్య లాంటి అంశాల్లో ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది. దేశంలోని అధిక జనాభా, పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం లాంటి సమస్యలకు ఏకైక దివ్య ఔషధం నాణ్యమైన ఉన్నత విద్య గొడుగులోకి అర్హతగల యువతకు తీసుకురావడమే. విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యకు నెలవులు. సాధారణ యువతను విశ్వ విజేతలుగా మార్చగల సమోన్నత విజ్ఞాన వేదికలుగా విశ్వవిద్యాలయాలు అద్వితీయ సేవలు అందించగలగాలి. విశ్వ కుగ్రామాన్ని పాలించగల శక్తి యుక్తులను విశ్వవిద్యాలయాలు ప్రదానం చేయగలగాలి. యూనివర్సిటీల ద్వారా డిగ్రీ, పిజి, పిహెచ్‌డి లాంటి పట్టాలు అందించబడతాయని మనకు తెలుసు. ఆధునిక శాస్త్రసాంకేతిక ప్రగతికి కందెనగా యూనివర్శిటీలు అపార జ్ఞాన బోధనలు, విషయ పరిజ్ఞానాలు, పరిశోధనా కేంద్రాలుగా నిలబడాలి. సామాన్యుల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ఉన్నత విద్య ఉపయుక్తంగా ఉండాలి. సమాజాభివృద్ధికి దోహదపడని విద్య సుగంధ పరిమాళాలు పంచలేని ప్లాస్టిక్ పువ్వులతో సమానం. 2030-32 నాటికి ప్రపంచంలోనే 10 ట్రిలియన్ డాలర్ల 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశ కలలు సాకారం కావడానికి ఉన్నత విద్య వనరులు ఉపయోగపడాలి. విద్యార్జనతో పాటు పరిశోధనలు, సృజన, వినూత్న ఆలోచనలు యువతలో నాటుకు పోవాలి. నేటి విశ్వవిద్యాలయాలు నిధులు, అధ్యాపకులు, మౌళిక వనరులు, అర్హతగల పరిశోధకుల తీవ్ర కొరతల నడుమ ఎవరికీ పట్టని విశ్వవిద్యాలయాలు నేడు కళావిహీన అనాధాశ్రమ కేంద్రాలుగా మారిపోవడం సోచనీయమే కాదు, నేటి యువత భవితకు అత్యంత ప్రమాదకరం, రేపటి అశాంతికి కారణభూతం. ఉత్సవ విగ్రహాలుగా మారిన సరస్వతీ నిలయాలు దేదీప్యమానంగా జ్ఞానజ్యోతులతో వెలిగిపోవాలి. యూనివర్సిటీల్లో నాణ్యమైన ఉన్నత విద్య ఫలితంగా ఉద్యోగ ఉపాధి కల్పన, యువతను సత్పౌరులుగా మార్చడం, నాయకత్వ పటిమ కలిగిన యువభారత నిర్మాణం, పరిశోధనా రంగాలు సామాన్యని బాధలకు పరిష్కార లేపనాలను రూపొందించడంలో సఫలం కావాలి. 'ఉన్నత' విద్య 'ఉత్త' విద్య కాదని, ఉత్తమ శ్రేణి జ్ఞాన సంపన్నులను తయారు చేసే వేదికలుగా మన విశ్వవిద్యాలయాలు కొలువుల కోవెలలుగా మారాలని, భరతమాత తన నైపుణ్య యువ పుత్రులను చూసి గర్వపడాలి.

భారత దేశంతో ఉన్నత విద్య :

ఇండియాలో 54 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 435 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, 126 డీమ్డ్ యూనివర్సిటీలు, 388 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 38,000 జూనియర్/డిగ్రీ కళాశాలల్లో 37.4 మిలియన్ల విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో నిమగ్నమై ఉన్నాయి. పరిశోధనాత్మక విత్తులను విద్యార్థి మదిలో నాటడానికి పాఠశాల విద్య ఉపకరించాలి. చిన్నారుల్లో 'సైంటిఫిక్ స్పిరిట్' రేకెత్తించే విద్య కల్పనలో మన నిన్నటి విద్యావిధానాలు విఫలం అయ్యాయి. నేడు కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెడుతున్న నూతన విద్యావిధానం-2020 (యన్ఈపి-2020) చురుకైన, వినూత్న, సృజన విజ్ఞాన సమాజాన్ని రూపొందించడంలో సఫలం కావాలనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నాం. గత జాతీయ విద్యావిధానాలు (1968, 1986) ఉద్యోగసాధన నైపుణ్యాలను ఆశించినంతగా పెంచలేక పోయాం. నేటి రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు గత ఘన చరిత్రగానే మిగిలిపోయాయి. దేశంలో 78.6 శాతం ప్రైవేట్ కళాశాలలు ఉండగా, ఏపిలో 80 శాతం, తెలంగాణలో 78.5 శాతం ప్రైవేట్ కళాశాలలు ఉన్నత విద్యను అందిస్తున్నాయి.

ఉన్నత విద్యలో జిఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో):

2019-20 వివరాల ప్రకారం మన 'హైయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియో (జిఈఆర్)' 27.1 శాతం మాత్రమే ఉండడం చూస్తున్నాం. ఏపిలో 35.2 శాతం, తెలంగాణలో 35.6 శాతం (సిక్కిమ్‌లో అత్యధికంగా 75.8 శాతం, చండీఘర్‌లో 52.1 శాతం) జిఈఆర్ నమోదు అయ్యింది. ఆంధ్రలో పురుషుల్లో 38.3 శాతం, మహిళల్లో 32.2 శాతం జిఈఆర్ నమోదు అయ్యింది. తెలంగాణలో పురుషుల్లో 34.8 శాతంగా నిర్ణయించబడింది. ఏపిలో యస్‌సి విభాగంలో 31.2 శాతం, యస్‌టిలో 29.4 శాతం జిఈఆర్ నమోదు అయ్యింది.

భారత్‌లో పరిశోధనలు/పెటెంట్ హక్కులు :

ప్రపంచవ్యాప్తంగా 2018లో 26 లక్షల పరిశోధనా వ్యాసాలు అచ్చు అయ్యాయి. దశాబ్దకాలంగా భారత్‌లో పరిశోధనా పత్రాల ముద్రణలు పెరగడం హర్షదాయకం. చైనా (5.3 లక్షలు), యుయస్ (4.23 లక్షలు) తరువాత 3వ అత్యధిక పరిశోధనా వ్యాసాలు అచ్చువేసే దేశంగా భారత్ (1.36 లక్షలు) నిలుస్తున్నది. 2017-18లో ప్రపంచవ్యాప్తంగా 13,045 పెటెంట్స్ హక్కులు పొందగా, అందులో ఇండియా నుంచి 1,937 పెటెంట్స్ పొందారు. ముద్రిత పరిశోధనా పత్రాల తరువాత స్థానాల్లో జర్మనీ (1.04 లక్షలు), జపాన్ (0.98 లక్షలు), యుకె (0.98 లక్షలు), రష్యా (0.82 లక్షలు), ఇటలీ (0.71 లక్షలు), దక్షిణ కొరియా (0.66 లక్షలు), ఫ్రాన్స్ (0.66 లక్షలు) జాబితాలో తొలి 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి. భారతదేశ పేటెంట్ (మేధోసంపత్తి హక్కులు) దరఖాస్తుల్లో 65 శాతం మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ నుంచే ప్రవేశపెట్టడం జరుగుతోంది. 2008-18 దశాబ్దంలో ఇండియాలోని 6800 సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థల ద్వారా పరిశోధనా పత్రాల ముద్రణలు సాలీన 10.73 శాతం (ప్రపంచ స్థాయిలో 5.31 శాతం) పెరగడం గమనించారు. 1017-18లో ఇండియా జిడిపిలో 0.7 శాతం మాత్రమే రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి)కు నిధులు కేటాయించడం జరిగింది. బ్రెజిల్ 1.3 శాతం, రష్యా 1.1 శాతం, చైనా 2.1 శాతం వినియోగించడం చూస్తున్నాం. నేచర్ ఇండెక్స్-2021 ప్రకారం నాణ్యమైన పరిశోధనల్లో అమెరికా, చైనా, జర్మనీలు ముందు ఉండగా, ఇండియా 8వ స్థానంలో నిలిచింది. భారత్‌లోని ముఖ్యంగా ఐఐటీలు, ఐఐయస్‌సి, యన్ఐటీలు, సియస్ఐఆర్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ ఆర్ అండ్ డి సంస్థల్లో పరిశోధనల్లో అగ్రభాగాన నిలుస్తున్నాయి.

సవాళ్లను అధిగమించడం ఎలా ?

యన్ఈపి-2020 ద్వారా కోరుకున్న కోర్సులను చేసుకునే 'చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్' అవకాశం కల్పించారు. పిజీ కోర్సుల్లో రిసెర్చి ప్రాజెక్టులు తప్పనిసరి చేయడం, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు పిహెచ్‌డితో పాటు నెట్/స్లెట్‌లను కనీస అర్హతగా చేయడం శుభపరిణామం. నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధనలకు ఊతం ఇవ్వడానికి 100కు పైగా టాప్ ర్యాంక్ విదేశీ యునివర్సిటీలకు అనుమతులు ఇచ్చారు. 'నేషనల్ రీసెర్చి ఫౌండేషన్' సంస్థను ఏర్పాటు చేసి, నాణ్యమైన వినూత్న సృజనశీల పరిశోధనలకు ఆర్థిక చేయూత, వనరుల కల్పన చేయబడుతుంది. విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో నిధులను అందుబాటులో ఉంచడం, అధ్యాపకుల పదోన్నతుల్లో పరిశోధనానుభవానికి పెద్ద పీట వేయడం జరగాలి. పాఠశాల నుంచే వృత్తి విద్యా నైపుణ్యం కలిగిన టీచర్స్‌ను నియమించడం, ప్రతిభ ఆధార నిధుల విడుదల, అత్యాధునిక పరిశోధనాలయాలను నెలకొల్పడం, విశ్వవిద్యాలయాల్లో అర్హతగల అధ్యాపకుల నియామకం, యునివర్సిటీల్లో రాజకీయ జోక్యం లేకపోవడం, పరిశోధనల ఆధారంగా పదోన్నతులు/ఇంక్రిమెంట్లు కల్పించడం, ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయడం, విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ / సైంటిఫిక్ వాతావరణం కల్పించడం లాంటి చర్యలు సత్వరమే తీసుకోవాలి. యన్ఈఆర్-2020 సహాయంతో భారతదేశంలో పరిశోధనారంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వికసించాలని కోరుకుందాం. విశ్వ దేశాల్లో రాణించగల బహుముఖీన ప్రతిభగల నైపుణ్య యువతను మన విశ్వవిద్యాలయాలు అందించుటలో సఫలం కావాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఇకపై ముగ్గురు పిల్లల్ని కనవచ్చు..

న్యూఢిల్లీ, ఆగస్టు 21:చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో దారుణంగా పడిపోతున్న జననాల రేటును తిరిగి పెంచేందుకు చైనా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. చైనా పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇకపై ప్రతి ఒక్కరు ముగ్గురు పిల్లల్ని కనేందుకు అధికార కమ్యూనిస్ట్ పార్టీ తీసుకొచ్చిన ప్రతిపాదనకు ఆ దేశ పార్లమెంట్ 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్' (ఎన్‌పీసీ) స్థాయీ సంఘం నిన్న గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో అధిక సంతానానికి ప్రజలు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా ప్రతిపాదన తీసుకొచ్చింది. కుటుంబాలపై పడే భారం, పిల్లలను పెంచేందుకు, చదువుకు అయ్యే వ్యయాలను తగ్గించడంతోపాటు ఆర్థిక సాయం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను తీసుకొచ్చింది. కాగా, ఈ ఏడాది మేలో ఇద్దరు పిల్లల విధానాన్ని సడలించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ముగ్గురు పిల్లల్ని కనేందుకు అనుమతి నిచ్చింది.

# తెలంగాణలో గౌడన్నలకు శుభవార్త.. త్వరలో ఉచితంగా బైకులు

హైదరాబాద్ , ఆగష్టు 21:తెలంగాణ ప్రభుత్వం మరో సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో రెండు లక్షల మంది కల్లుగీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. మొదటి దశలో 15 వేల మంది లబ్ధిదారులకు మోపెడ్ వాహనాలను అందిస్తామని శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

గౌడన్నలకు ఈ పథకం అమలు కోసం రూ.1,200 కోట్లు కేటాయించామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్ర కేబినెట్ అనుమతి రాగానే ఈ పథకాన్ని ప్రారంభిస్తామని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ ప్రభుత్వంలో కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. నేతన్నలకు పథకం పేరుతో ఆర్థిక సాయం చేస్తుంది. అలాగే ముదిరాజ్‌లకు ట్రాలీలను ఉచితంగా అందించింది. మరోవైపు దళితుల అభివృద్ధి కోసం రూ.10 లక్షలు ఇస్తూ ఇటీవల ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# అధికారంపై పగటి కలలొద్దు: కాంగ్రెస్, బీజేపీలకు గుత్తా చురకలు

హైదరాబాద్ , ఆగష్టు 21:తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు కలలు కంటున్నారని టీఆర్ఎస్ నేత, శాసనమండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులు కుప్పగా మార్చిందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి, ప్రజల జేబుకు చిల్లు పెట్టారని విమర్శించారు. మరో 20 ఏళ్లు టీఆర్ఎస్ పార్టీనే అధికారంలో ఉంటుందని? ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉంటారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఒక్కటైనా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతోందా? అని ప్రశ్నించారు. పేదల కోసం ఏం చేశారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు, కిషన్ రెడ్డి అబద్ధాలు చెపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.కరోనా సెకండ్ వేవ్‌ను కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమయింని విమర్శించారు. అసైన్డ్ భూములను తీసుకున్నానని ఒప్పుకున్న ఈటల రాజేందర్ ను పార్టీలోకి ఎలా తీసుకున్నారని గుత్తా ప్రశ్నించారు. తెలంగాణపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు తోడేళ్ల మాదిరి దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. దళితులకు కాంగ్రెస్ వాళ్లు కూడా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో సామాజిక న్యాయం అమలవుతోందని తెలిపారు.

కొత్తగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చందాలు అడుగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హైదరాబాదును కూడా అమ్మేస్తారని గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# జూన్, 2021 నెలలో ఈపీఎఫ్ఓ లో కొత్తగా 12.83 లక్షల నికర చందాదారుల చేరిక

న్యూఢిల్లీ, ఆగష్టు 21:ఈపీఎఫ్ఓ (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్స్ ఆర్గనైజేషన్)లో 2021 జూన్ నెలలో కొత్తగా 12.83 లక్షల మంది సభ్యులుగా చేరారు. ఈపీఎఫ్ఓలో సభ్యులుగా చేరుతున్న వారి సంఖ్య పెరుగుతున్నదని 2021 ఆగష్టు 20వ తేదీన విడుదలైన ఈపీఎఫ్ఓ తాత్కాలిక పేరోల్ వివరాలు తెలియజేస్తున్నాయి. కోవిడ్ రెండవ దశ ప్రభావం తగ్గడంతో ఈపీఎఫ్ఓ లో సభ్యులుగా చేరిన వారి సంఖ్య 2021 ఏప్రిల్, మే నెలలతో పోల్చి చూస్తే జూన్ నెలలో గణనీయంగా పెరిగింది. 2021 మే నెల వివరాలతో పోల్చి చూస్తే ఈపీఎఫ్ఓలో సభ్యులుగా చేరినవారి సంఖ్య జూన్ నెలలో 5.09 లక్షలు ఎక్కువగా ఉంది.

2021 జూన్ నెలలో చేరిన 12.83 మందిలో 8.11 లక్షల మంది తొలిసారిగా ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ పథకం సామాజిక భద్రత పరిధిలోకి వచ్చారు. జూన్ నెలలో 4.73 లక్షల మంది సభ్యులు సంస్థ సభ్యత్వం వదులుకున్నారు. అయితే, ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చే సంస్థల్లో ఉద్యోగాల్లో చేరడంతో వారు తిరిగి సభ్యులుగా చేరారు. ఎక్కువ మంది ఖాతాదారులు తమ పీఎఫ్ నిల్వలను తితిగి తీసుకోకుండా మునుపటి ఉద్యోగం నుండి ప్రస్తుత పీఎఫ్ ఖాతాకు నిధులను బదిలీ చేసుకుంటూ ఈపీఎఫ్ఓ సభ్యత్వాన్ని కొనసాగించడానికి ముందుకు వస్తున్నారని దీనివల్ల తెలుస్తోంది.

వయస్సు వారీగా పోల్చినప్పుడు 18-25 సంవత్సరాల వయస్సు గల 6.15 లక్షల మంది అత్యధిక సంఖ్యలో నికర నమోదులను నమోదు చేసుకున్నారు, ఇది జూన్, 2021 నెలలో చేరిన మొత్తం చేరికల్లో వీరి సంఖ్య 47.89%. గా ఉంది. 29-35 మధ్య వయస్సు ఉన్న దాదాపు 2.55 లక్షల మంది ఈపీఎఫ్ఓ సభ్యత్వం పొందారు. వయస్సు వారీగా ఈపీఎఫ్ఓలో చేరిన వారి సంఖ్యను పరిశీలిస్తే వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగాల్లో చేరుతున్నారని తెలుస్తున్నది.

లింగాల వారీగా విశ్లేషిస్తే జూన్ నెలలో ఈపీఎఫ్ఓలో 2.56 లక్షలు మంది మహిళలు చేరారు. ఇది మే 2021 లో చేరిన వారి కంటే 0.79 లక్షలు ఎక్కువ.

రాష్ట్రాల వారీగా చేరికలను పరిశీలిస్తే మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాల నుంచి జూన్ నెలలో సుమారు 7.78 లక్షల మంది చందాదారులు ఈపీఎఫ్ఓలో చేరారు. దీనితో ఈ రాష్ట్రాలు సభ్యుల చేరికలో ఇప్పటికీ ముందంజలో ఉన్నాయి. ఇది అన్ని వయసుల మొత్తం నికర చేరికల్లో 60.61%గా ఉంది. పరిశ్రమల వారీగా గణాంకాలను పరిశీలించినప్పుడు 'నిపుణుల సేవలు' కేటగిరీ (మానవశక్తి సంస్థలు, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు మరియు చిన్న కాంట్రాక్టర్లు మొదలైనవి)నుంచి జూన్ నెలలో మొత్తం చందాదారులలో 41.84% చందాదారులు ఉన్నారు. వాణిజ్య-వాణిజ్య సంస్థలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, భవననిర్మాణం, వస్త్రాలు, వస్త్రాల తయారీ, ఆస్పత్రులు మరియు ఫైనాన్సింగ్ సంస్థల వంటి పరిశ్రమల నుంచి చేరిన చందాదారుల సంఖ్యలో పెరుగుదల కనిపించింది.

పేరోల్ డేటా తాత్కాలికమైనది. ఈ వివరాలు ఉద్యోగుల వివరాలతో పాటు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. సమాచారం ప్రతి నెలా నవీకరించబడుతుంది. మే -2018 నుంచి ఈపీఎఫ్ఓ సెప్టెంబర్ 2017 కాలానికి సంబంధించిన గణాంకాలను విడుదల చేస్తూ వస్తోంది.

పదవీ విరమణ చేసిన సభ్యులు, అకాల మరణం చెందిన సభ్యుల కుటుంబాలకు కుటుంబ పెన్షన్ ఉ బీమా ప్రయోజనాలను, ప్రావిడెంట్ ఫండ్ ను ఈపీఎఫ్ఓ అందిస్తుంది. ఈపీఎఫ్ ఎంపీ చట్టం, 1952 పరిధిలోకి వచ్చే వ్యవస్థీకృత/సెమీ వ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించే బాధ్యతను ఈపీఎఫ్ఓ ప్రధానంగా నిర్వహిస్తున్నది.

# హుజురాబాద్ బరిలో కొండా.. టీ.పీసీసీ ఆలోచన ఏంటో?

హైదరాబాద్ , ఆగష్టు 21:హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరు ఉంటారు? అన్నది ఒకటి,రెండు రోజుల్లో క్లారిటి రానుంది. మాజీ మంత్రి కొండా సురేఖకు టికెట్ ఖాయం అయిందని ప్రచారం జరుగుతున్నా.. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. దీంతో టికెట్ ఎవరికి ఇస్తారు? అన్నది పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. హుజురాబాద్ బరిలో ఉంటే పేర్లను సిద్ధం చేసిన టీ.పీసీసీ? ఆ జాబితాను అధిష్టానానికి ప్రతిపాదించనుంది. అభ్యర్థిగా బీసీ వర్గం నుం చి కొండా సురేఖ, ఎస్సీ వర్గం నుంచి స్థాని క కాంగ్రెస్ నేత తిప్పారపు సంపత్, ఓసీ వర్గం నుంచి పత్తి కృష్ణారెడ్డి పేర్లను ప్రతిపాదిస్తూ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మ న్.. టీపీసీసీకి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. దీనిపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాగూర్ .. రాజనర్సింహాతో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ముగ్గురిలో ఒక్క పే రునే ఎంపిక చేసి అధిష్టానానికి పంపుతారా? లేక ముగ్గురి పేర్లను పంపుతారా? అన్న దానిపై స్పష్టత లేదు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం కొండా సురేఖ పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో అధిష్టానం అనుమతితో ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

టీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి బీసీ వర్గానికి చెందిన గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్ బరిలో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ కూడా బీసీ వర్గానికి చెందిన వారినే అభ్యర్థిగా ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కొండా సురేఖకు టికెట్ ఖాయం అయినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ పద్మశాలి సామాజికవర్గానికి చెందినవారు కాగా ఆమె భర్త మురళి కాపు సామాజికవర్గానికి చెందినవారు. ఈ రెండు సామాజికవర్గాలకు 55 వేల పైచిలుకు ఓట్లు ఉండడం కలిసివచ్చే అంశంగా కాంగ్రెస్ నేతలు భావించినట్లు సమాచారం. ఈటల రాజేందర్ ముదిరాజ్ వర్గానికి చెందినవారు కాగా.. గెల్లు శ్రీనివాస్ యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. నియోజకవర్గంలో ముదిరాజ్‌ల ఓట్లు 23,220 ఉండగా, యాదవ సామాజికవర్గానికి 22,150 ఓట్లు ఉన్నాయి. కొండా సురేఖను పోటీలో నిలిపితే కాపు, పద్మశాలి రెండు సామాజికవర్గాల నుంచి ఓట్లు పొందే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎవరు పోటీ చేసినా 20 నుంచి 30 వేల వరకు సాంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటూ వస్తున్నదని, కొండా సురేఖను బరిలో దింపడం ద్వారా బలమైన పోటీ ఇవ్వవచ్చని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

అయితే, కొండా సురేఖకు టికెట్ ఇవ్వడంపై కొందరు నేతలు అభ్యతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ కు చెందిన స్థానిక నేతనే బరిలో దింపాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిజానికి ఈ నె ల 18నే కొండా సురేఖ పేరును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, స్థానికులకే ఇవ్వాలని డిమాండ్లు రావడంతో వాయిదా పడింది.

మరోవైపు హుజూరాబాద్‌లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటిస్తూ 2023 ఎన్నికల్లో కూడా తనకే టికెట్ ఇవ్వాలని కొండా సురేఖ అధిష్టానం వద్ద ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ లో ఓటమి పాలైనా.. బలం పెంచుకోగలిగి వచ్చే ఎన్నికల నాటికి గట్టి పోటీదారుగా మారవచ్చనే ఉద్దేశంతోనే ఆమె వచ్చే ఎన్నికల్లో కూడా తనకే టికెట్ ఇవ్వాలనే డిమాండ్‌ను అధిష్టానం ముందుంచినట్లు సమాచారం. ఈ డిమాండ్‌తోపాటు వరంగల్ అర్బన్, పరకాల, జయశంకర్ భూపాలపల్లి టికెట్లను కూడా తాము సూచించినవారికి ఇవ్వాలని కూడా ఆమె షరతు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి కాంగ్రెస్ హైకమాండ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హుజూరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ఏ మేరకు బలం చూపిస్తుందో చూడాలి.

# పటేల్ స్టేడియానికి మోదీ పేరెందుకు ?: బీజేపీకి రేవంత్ ప్రశ్న

హైదరాబాద్ , ఆగష్టు 21:ప్రధాని మోదీపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గాంధీ భవన్ ప్రకాశం హాల్‌లో రాజీవ్ స్మారక కమిటీ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు పేరు మార్చడంపై మండిపడ్డారు. "రాజీవ్ ఖేల్ రత్న అవార్డు పేరును ఎందుకు మార్చారంటే.. రాజీవ్ గాంధీ ఏమైనా క్రీడాకారుడా? అని బీజేపీ వాళ్లు మాట్లాడుతున్నారు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం పేరును మోదీ స్టేడియంగా ఎందుకు మార్చారు? మోదీ ఏమైనా క్రీడాకారుడా?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

దేశ నిర్మాణంలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజీవ్ ఎంతగానో తాపత్రయపడ్డారని ఆయన పేర్కొన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌దేనని అన్నారు. అంతేకాదు, తన క్యాబినెట్‌లో 40శాతం యువతకు అవకాశం కల్పించి ప్రోత్సహించారని గుర్తు చేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాజీవ్ ఖేల్ రత్న అవార్డును కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే.. అందులో రాజీవ్ పేరును తొలగించడం ఎంత వరకు సమంజసమని రేవంత్ నిలదీశారు.

# ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ , ఆగష్టు 21:నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి హరీశ్ రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎగ్జిబిషన్ సొసైటీ యాజమాన్య కమిటీ ప్రకటించింది. అధ్యక్షుడిగా ఉండేందుకు అంగీకరించినందుకుమంత్రి హరీశ్ రావుకు సొసైటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటీ మరింత పథంలో నడిచేలా కృషిచేస్తానని అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీని మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు. గత 80 ఏళ్లుగా ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నుమాయిష్‌ను విశ్వవ్యాప్తం చేద్దామన్నారు. సొసైటీ విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని చెప్పారు. వృత్తి నైపుణ్యం మెరుగుపడి ఉపాధి అవకాశాలు పొందేలా వారిని తీర్చిదిద్దుదామని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

# నిరుద్యోగులతో నామినేషన్ వేయిస్తాం: షర్మిల..

హైదరాబాద్ , ఆగష్టు 21:హుజూరాబాద్ ఉప ఎన్నికలో నిరుద్యోగులతో వందలాది నామినేషన్లు వేయిస్తామన్నారు వైఎస్సార్‌టీపీ నాయకురాలు వైఎస్ షర్మిల. 'కేసీఆర్‌కు గుణపాఠం చెప్పడానికి వచ్చే హుజూరాబాద్ ఉప ఎన్నికలో వందల సంఖ్యలో నామినేషన్లు వేయించి కేసీఆర్ మెడలు వంచాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిర్ణయించింది. ఇక నుంచి వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిరుద్యోగ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది. పూర్తి స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేసే వరకూ యువత పక్షాన నిలబడుతుంది' అని షర్మిల తెలిపారు. ఉద్యోగాల కోసం తెలంగాణ ఉద్యమాన్ని కొట్లాడి నడిపించి 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది విద్యార్థులు. 7 ఏండ్ల తెలంగాణలో మళ్లీ ఉద్యోగాల నోటిఫికేషన్స్ కోసం మరో ఉద్యమాన్ని మొదలు పెట్టింది వైఎస్సార్‌టీపీ. 7 వారాలుగా నిరుద్యోగ నిరాహార దీక్షలతో నిరుద్యోగుల పక్షాన నిలబడ్డాం' అని షర్మిల చెప్పారు.

# రహదారిపై పెద్దపులి సంచారం.. వాహనదారుల్లో భయం

కుమ్రం భీం,ఆగష్టు 21: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. జిల్లాలోని పెంచికల్‌పేట మండలంలో ఉన్న కొండపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోంది. సలుగుపల్లి, లోడ్ పల్లి మధ్య ప్రధాన రహదారిపై పెద్దపులి నడుచుకుంటూ కనిపించింది. శనివారం ఉదయం అటవీ ప్రాంతంలోని రహదారులపై వాహనదారులకు పెద్దపులి కనిపించినట్లు గ్రామస్తులు చెప్పారు. దీంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. పెద్దపులి సంచరిస్తున్న వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. పులి సంచారంతో పెంచికల్ పేట కొండపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో మొక్కలు నాటిన టీఆర్ఎస్‌వీ నేత

హైదరాబాద్ , ఆగష్టు 21: తన పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా టీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మొక్కలు నాటారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు ఎంపీ సంతోష్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# ఆఫ్ఘన్ నుంచి అమెరికన్ల తరలింపు అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ : బైడెన్

వాషింగ్టన్, ఆగష్టు 21: ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న ప్రతి ఒక అమెరికన్‌ను తీసుకువస్తామని ఆ దేశాధ్యక్షుడు బైడెన్ ( ఏనీవ ఃతిటవని) తెలిపారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా పౌరుల తరలింపు ప్రక్రియ చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ అని ఆయన అన్నారు. ఇదో అతి పెద్ద, అత్యంత సంక్లిష్టమైన తరలింపు అని జో బైడెన్ తెలిపారు. వైట్‌హౌజ్ నుంచి జాతిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అయితే తుది ఫలితం ఎలా ఉంటుందో ఇప్పుడు ఏమీ హామీ ఇవ్వలేన్నారు. తాలిబన్లు ఆఫ్ఘన్‌ను ఆక్రమించిన తీరు విషయంలో అమెరికా వైఖరిపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బైడెన్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తాలిబన్ ఆక్రమిత కాబూల్ నుంచి అమెరికన్లను, ఇతర విదేశీయులను తరలించడం ఓ పెను ప్రమాద ఆపరేషన్‌గా మారిందన్నారు. అమెరికా వైమానిక విమానాల్లో ఇప్పటి వరకు 13 వేల మందిని తరలించినట్లు ఆయన చెప్పారు. ఆఫ్ఘన్‌లో ఎంత మంది అమెరికన్లు ఉన్నారో తమ ప్రభుత్వానికి తెలియదని బైడెన్ తెలిపారు. కానీ అమెరికన్లు ఎవరైనా స్వదేశం రావాలనుకుంటే, వారిని కచ్చితంగా ఇంటికి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పారిశుధ్య కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి : మంత్రి తలసాని

హైదరాబాద్ , ఆగష్టు 21: పారిశుధ్య కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జలమండలి ఆధ్వర్యంలో మురుగునీటి నిర్వహణ, కార్మికుల భద్రతపై నిర్వహిస్తున్న భద్రతా పక్షోత్సవాలలో భాగంగా శనివారం మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమానికి మంత్రి తలసాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మ్యాన్ హోల్స్ పూడికతీత పనుల్లో మానవ ప్రమేయం లేకుండా అవసరమైన చోట్ల కొత్త టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.రోబోటిక్ టెక్నాలజీతో మ్యాన్ హోల్స్‌ను శుద్ధి చేసే ప్రక్రియను ఇప్పటికే సనత్ నగర్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారని, ఇది విజయవంతమైందని.. త్వరలోనే నగర వ్యాప్తంగా ఈ విధానం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని మ్యాన్ హోళ్లలో వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో జలమండలికి పోటీగా దేశంలో ఏ నగరం కూడా దరిదాపుల్లో కూడా రాదని కొనియాడారు.

జలమండలికి ఇప్పటికే వివిధ కేటగిరీల్లో ఎన్నో కేంద్ర ప్రభుత్వ అవార్డులు లభించాయని.. ఎండీ దాన కిశోర్ గారి సారథ్యంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జలమండలి ఎండీ దాన కిశోర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీ సాయన్న, కార్పొరేటర్లు, జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎంలు ప్రభు, ప్రసన్న కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు, కాలనీ సంఘాలు, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రీశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

హైదరాబాద్ , ఆగష్టు 21:యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామివారిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం యాదాద్రికి చేరుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు కేంద్ర మంత్రికి ఆలయ ఈవో గీత, అర్చకులు స్వాగతం పలికి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శనం అనంతరం వేద పండితులు కిషన్ రెడ్డికి ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత యాదాద్రి ఆలయ నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన విశేషాలను అధికారులు ఆయనకు వివరించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో నేడు, రేపు భారీ వర్షాలు

అమరావతి, ఆగష్టు 21: ఆంధ్రప్రదేశ్‌లో నేడు, రేపు, వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దిశను మార్చుకుని క్రమంగా మధ్య భారత దేశం వైపు ప్రయాణించింది.. అల్పపీడన ప్రభావంతో పశ్చిమ, నైరుతి గాలులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపుగా వీస్తున్నాయి. ఈ కారణంగా ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. ఇది రేపటికి మరింత బలపడనుంది. దీని ఫలితంగా ఈ నెల 21, 22 తేదీల్లో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# పోలీసులు సత్ప్రవర్తనతో మెదులుతూ సమర్ధవంతమైన సేవలందించాలి

## -కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ జూన్ 21(నేటినిజం ప్రతినిధి): కమిషనరేట్‌లోని అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు సత్ప్రవర్తనతో మెదులుతూ సమర్ధవంతంగా విధులను నిర్వహించాలని

కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. యూనిఫారం ధరించిన పోలీసులపై అన్నివర్గాల ప్రజల దృష్టి ఉంటుందని, క్రమశిక్షణతో మెదులుతూ అన్నివర్గాల ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ సేవలందించడం ద్వారా పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని పేర్కొన్నారు.

శనివారంనాడు పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగాలకు చెందిన పోలీసులతో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు ఒకే కుటుంబసభ్యు లుగా మెదులుతూ పరస్పర సహకారంతో సమర్ధవంతమైన సేవలందించేందుకు మానసికంగా శారీరకంగా సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అన్నిస్థాయిలకు చెందిన పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తానని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో పరిష్కరించేందుకు ఆస్కారం ఉన్న సమస్యలను తనదృష్టికి తీసుకవచ్చినట్లయితే పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. పోలీసు కుటుంబాల సౌకర్యార్ధం వివిధ రకాల నిత్యావసర వస్తువులను హోల్‌సేల్ ధరల్లో అందించేందుకు పోలీస్‌స్టోర్‌ను పునరుద్ధరించనున్నామని చెప్పారు. అలాగే యూనిట్ ఆసుపత్రి సేవలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వివిధ రకాల బందోబస్తుల సందర్భంగా సంయమనంతో వ్యవహరిస్తూ విధులను నిర్వహించాలని చెప్పారు. పోలీస్‌శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడేవారిపై శాఖాపరంగా కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధినిర్వాహణ అనంతరం లభించే సమయాన్ని కుటుంబసభ్యులకు కేటాయించాలని సూచించారు. డబ్బులను అనవసరంగా ఖర్చుచేయవద్దని, పొదుపు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఎన్నోరకాల అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వివిధ రకాల వ్యాయామాలు, యోగా, ధ్యానం లాంటి చర్యలను దినచర్యలో భాగంగా అలవర్చుకున్నట్లయితే మానసికంగా ఉపశమనం లభిస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు యం నరేందర్, ఆర్ఐలు మల్లేశం,జానీమియా,మురళి,శేఖర్,కిరణ్‌కుమార్, రమేష్, ఆర్ఎస్ఐ రాజులతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధిలో ముందుకెళ్లాలి : మంత్రి

ఖమ్మం, ఆగష్టు 21: : నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం జడ్పీ హాల్‌లో శనివారం పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమాన్ని ఎంపీ నామా నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజనపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. రోడ్లు బాగుంటేనే రవాణా సౌకర్యం మెరుగై గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

రోడ్లు, భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఫలితం దక్కదన్నారు. ఇంజినీర్లు నాణ్యతా ప్రమాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులోకి వస్తున్న కొత్త టెక్నాలజీని ఇంజినీర్లు అందిపుచ్చుకోవాలన్నారు. నూతన టెక్నాలజీ ద్వారా రోడ్లు వేయడంతో 15 నుంచి 20 శాతం వరకు అన్ని రకాలుగా ఆదా అవుతుందని మంత్రి తెలిపారు. గతంలో ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలో గ్రామ్యులర్ సబ్ బేస్ టెక్నాలజీతో 426 రోడ్లు రూ.2 కోట్ల నిర్మించినట్లు చెప్పారు. అలాంటి పద్ధతులను అవలంభిస్తూ రోడ్లు వేసుకోవాలన్నారు. మోదీ ప్రధాని అయ్యాక పీఎంజీఎస్‌వైని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

ఒక్కో నియోజకవర్గంలో 25 కిలోమీటర్లు కూడా సరిగా ఇవ్వలేకపోయిందన్నారు. జిల్లాల్లో వేయాల్సిన గ్రామీణ రోడ్లు వేల కిలోమీటర్లు ఉన్నాయని, వాటిపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. ఖమ్మానికి పూర్తిగా అన్యాయం జరిగిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకుని కేంద్ర మంత్రులు పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. గడచిన ఏడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం సహకారంతో వేల కిలోమీటర్ల రోడ్లు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, పంచాయతీరాజ్ ఎస్ఈ సీతారాం, ఈఈ చంద్రమౌళి ఉన్నారు.

# తోడేళ్ల మాదిరిగా ప్రతిపక్షాల వ్యవహారం: గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ, ఆగష్టు 21: రాష్ట్రంలో ప్రతిపక్షాలు తోడేళ్ల మాదిరిగా వ్యవహరిస్తున్నాయని శాసనమండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు అధికారంపై పగటి కలలు కంటున్నారని, వారి కలలు కల్లలుగానే మిగిలిపోతాయని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సమన్యాయం, స్వచ్ఛ పాలన, సామాజిక న్యాయం ఆధారంగా పాలన సాగుతోందని వెల్లడించారు. శనివారం తన నివాసంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు తోడేళ్లలాగా తెలంగాణపై దాడి చేస్తున్నారని, అనైతిక విమర్శలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా, అత్యుత్తమ జీవనప్రమాణాలతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చుతున్నాయిని ఆరోపించారు.బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులు కుప్పగా మార్చిందని, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి, ప్రజల జేబుకు చిల్లు పెట్టారని విమర్శించారు. బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఎక్కడైనా తెలంగాణలో అమలవుతున్న ఒక్క పథకమైన ఉందా చెప్పాలని సవాలు చేశారు. పేదల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ విమర్శించారు. ఎస్సీ అసైన్డ్ భూములను చేశారు, అన్ని అంశాల్లో విఫలం తీసుకున్నాని ఒప్పుకున్న ఈటల రాజేందర్‌ను అయ్యారన్నారు. కరోనా సెకండ్ వేవ్‌ను కట్టడి పార్టీలో ఎలా చేర్చుకున్నారని ప్రశ్నించారు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమయిందని

# మిషన్ మర్యాద' కింద 10,475 మందిపై చర్యలు

డెహ్రాడూన్, ఆగష్టు 21:: ఉత్తరాఖండ్‌లో ప్రవేశపెట్టిన 'మిషన్ మర్యాద' కింద ఈ ఏడాది జూలై 15 నుంచి ఇప్పటి వరకు 10,475 మందిపై చర్యలు తీసుకున్నట్లు ఆ రాష్ట్ర పోలీసులు తెలిపారు. 1,870 మందిని అరెస్టు చేయడంతోపాటు రూ. 19.5 లక్షలకు పైగా జరిమానా వసూలు చేసినట్లు చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో గంగా నది ఘాట్ వద్ద కొందరు యువకులు హుక్కా తాగారు. గమనించిన స్థానికులు వారిపై దాడి చేశారు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో మతపరమైన ప్రదేశాల గౌరవాన్ని కాపాడటం, పర్యాటక ప్రదేశాలలో పరిశుభ్రతను ప్రోత్సహించడం లక్ష్యంగా 'మిషన్ మర్యాద'ను ఉత్తరాఖండ్ పోలీసులు ప్రవేశపెట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన పది వేలకుపైగా మందిపై చర్యలు తీసుకోవడంతోపాటు సుమారు 20 లక్షల వరకు జరిమానాలు వసూలు చేశామని, సుమారు రెండు వేల మందిని అరెస్ట్ చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సత్యవతి

తిరుమల, ఆగష్టు 21: : తెలంగాణ గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కుటుంబ సమేతంగా శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.

అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే సీఎం కేసీఆర్‌కు మరింత శక్తిని ఇవ్వాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. కరోనా మహమ్మారి అంతరించి, తిరుమలకు గత వైభవం రావాలని ఆకాంక్షించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ తప్పకుండా గెలుస్తారని తెలిపారు. ఈటల రాజేందర్‌కు టీఆర్ఎస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆయన అత్యాశకు పోయి ఉప ఎన్నికలు తెచ్చారన్నారు.

# ఉగ్రవాదాన్ని సహించం.. తాలిబన్లకు జో బైడెన్ వార్నింగ్

వాషింగ్టన్, ఆగష్టు 21: ప్రపంచంలో ఎక్కడైనా ఉగ్రవాదాన్ని సహించబోమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గట్టిగా హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితిపై శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికన్ల తరలింపు ప్రారంభమైందని చెప్పారు.

ఇప్పటికే 13 వేల మంది తరలింపు

ఇప్పటివరకు 13 వేల మందిని తరలించామని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆఫ్ఘన్ నుంచి అమెరికన్లను తరలించడం అంత తేలిక కాదని స్పష్టం చేశారు. అమెరికన్ల తరలింపు ప్రక్రియ అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.అమెరికన్లను సురక్షితంగా స్వదేశానికి తరలిస్తామని పేర్కొన్నారు. అమెరికన్ల భద్రతే తమకు ప్రధానమని వెల్లడించారు.

అమెరికన్లను తరలించే విషయమై తాలిబన్లతో చర్చిస్తున్నట్లు జో బైడెన్ తెలిపారు. అమెరికన్లను తరలించడానికి ఆఫ్ఘన్‌కు మరిన్ని విమానాలను పంపుతామని చెప్పారు. అమెరికన్ పౌరులపై హింసను సహించబోమని తాలిబన్లను హెచ్చరించారు.

వచ్చేవారం జీ-7 కూటమిలో చర్చిస్తాం

ఆఫ్ఘనిస్థాన్‌లో వారం రోజులుగా కనిపిస్తున్న ద్రుశ్యాలు హ్రుదయ విదారకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితిపై వచ్చేవారం జీ-7 దేశాల కూటమి చర్చిస్తుందని జో బైడెన్ వివరించారు.

ఆల్ ఖైదా వ్యవస్థాపకుడు బిన్ లాడెన్ వంటి వారినే ఏరివేశామని జో బైడెన్ చెప్పారు. కాబూల్ విమానాశ్రయం ఆరువేల మంది అమెరికా సైనికుల పహారాలో ఉన్నదని తెలిపారు. మీడియా సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ కూడా ఉన్నారు.

# యోగి క్యాబినెట్‌లోకి జితిన్ ప్రసాద.. యూపీ ఎన్నికల్లో విజయమే లక్ష్యమా?!

లక్నో, ఆగష్టు 21:: వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్‌లో తిరిగి విజయం సాధించే దిశగా బీజేపీ వ్యూహ రచన చేస్తున్నది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన సీనియర్ నేత జితిన్ ప్రసాద, ప్రధాని నరేంద్రమోదీకి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఏకే శర్మ, లక్ష్మీకాంత్ బాజ్‌పాయి తదితరులు యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ఎన్నికలకు ముందే యోగి క్యాబినెట్ విస్తరణ?

యూపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే యోగి తన క్యాబినెట్‌ను విస్తరించనున్నట్లు తెలుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా యోగి క్యాబినెట్‌లో కులాల మధ్య సమతుల్యత తేవడానికి కమలనాథులు ప్రయత్నిస్తున్నారు. ముగ్గురు బ్రాహ్మణ సామాజిక వర్గ నేతలతోపాటు యూపీలో బీజేపీ మిత్రపక్షం నేత సంజయ్ నిషాద్ సహా మరో ఇద్దరు, ముగ్గురు నేతలకు చోటు కల్పిస్తారని వినికిడి.

### బ్రహ్మణుల్లో బీజేపీపై పెరుగుతున్న అసమ్మతి

గత మూడు ఎన్నికల్లో పార్టీకి దన్నుగా నిలిచిన యాదవేతర బలహీన వర్గాలు, జాతవేతర షెడ్యూల్ కాస్ట్, బ్రాహ్మణులను విశ్వాసంలోకి తీసుకోవాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నదని సమాచారం. యూపీలో తమను నిర్లక్ష్యం చేశారని బ్రహ్మణుల్లో అసమ్మతి పెరుగుతున్నట్లు వార్తలొచ్చాయి.

### అమిత్‌షా నివాసంలో సమాలోచనలు ఇలా

యూపీ ఎన్నికలకు ముందు యోగి క్యాబినెట్ విస్తరణ, పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాసంలో మూడున్నర గంటల పాటు చర్చలు జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, పార్టీ నేతలు సునీల్ బన్సాల్, స్వతంత్ర దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నట్లు విశ్వసనీయ సమాచారం.

# కరీంనగర్‌లో ఒకే కాన్పులో నలుగురు శిశువులు జననం

కరీంనగర్, ఆగష్టు 21: ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. ఈ ఘటన కరీంనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. కరీంనగర్ రూరల్ మండలం నాగులమాల్యాలకు చెందిన నిఖిత అనే గర్భిణికి శుక్రవారం ప్రసవ నొప్పులు రావడంతో స్థానిక యశోద కృష్ణ ఆసుపత్రిలో చేర్పించారు. మహిళ శనివారం నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. వీరిలో ఇద్దరు ఆడ శిశువులుగా మరో ఇద్దరు మగ శిశువులు. తల్లీ, పిల్లలందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. కాగా శిశువులు తక్కువ బరువుతో జన్మించడంతో ఇంక్యుబేటర్లలో ఉంచారు. ఒకేసారి నలుగురు పిల్లలు జన్మించడంతో నిఖిత ఆమె భర్త సాయికిరణ్ గౌడ్ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో పాటు మరో ఆసక్తికర విషయం ఎంటంటే నిఖిత కవల సోదరి లిఖిత సైతం నాలుగు నెలల క్రితం ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది.

# 5వ డివిజన్ లో చెత్త బుట్టలు పంపిణీ చేసిన కార్పొరేటర్ జహెరా బాను

కరీంనగర్ జూన్ 21(నేటినిజం ప్రతినిధి): నగరంలోని 5వ డివిజన్ లో శనివారం తడి, పొడి చెత్త బుట్టలను కార్పొరేటర్ జహెరా బాను డివిజన్ ప్రజలకు పంపిణీ చేశారు.

చెత్తను తడి, పొడి గా వేరు చేసి వేయాలని అవగాహన కల్పించారు.

ఈకార్యక్రమంలో ఎంఐఎం యువ నాయకుడు మహమ్మద్ అజ్జర్ దబీర్, ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు కాజమ్ అలీఖాన్, నసీర్, జవాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టియూదబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీ నారాయణ, సీనియర్ జర్నలిస్టు రాజు లను పరామర్శించిన మీడియా అకాడమీ చైర్మన్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): టీయూడబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రాచర్ల లక్ష్మీ నారాయణ, సీనియర్ జర్నలిస్ట్, చందుర్తి ఆంధ్రజ్యోతి విలేఖరి రాచర్ల రాజు ల మాతృమూర్తి రాచర్ల ఆగమ్మ ఈ నెల 11న అకాల మరణం చెందడం తో వారితో పాటు కుటుంబ సభ్యులను చందుర్తి మండల కేంద్రంలో ,తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆగమ్మ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. అల్లం నారాయణ సర్ తో పాటుగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్,తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్,రాష్ట్ర నాయకులు శివాజీ లు పరామర్శించారు.

# గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా దివ్యాంగులకు చేయూత!

## -ఎం.ఎల్.ఏ రమేష్ చేతుల మీదుగా 9 స్కూటీల పంపిణీ!

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా వారుప్రారంభించినటువంటి 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా వేములవాడ నియోజకవర్గంలోని వికలాంగుల సోదర సోదరీమణులకు మోటార్ సైకిళ్ళు పంపిణీ చేయడం జరిగింది. మొదటి విడతలో భాగంగా 12 మందికి ఎమ్మెల్ చెన్నమనేని రమేష్ బాబు చేతుల మీదుగా మోటార్ సైకిళ్లను అందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి వైస్ చైర్మన్ మధు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు , కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, గోలి మహేష్, నిమ్మశెట్టి విజయ్,మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కట్కూరి శ్రీనివాస్ సర్వర్ బాబున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, తెరాస పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, నాయకులు కొండ కనుకయ్య,గూడూరి మధు , తిరుపతి తదితరులు పాల్గొన్నారు ..

# ఎన్డీయేను సందర్శించిన త్రివిధ దళాధిపతులు.. ఎందుకంటే?

ముంబై, ఆగష్టు 21:: మహారాష్ట్ర పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే)ని త్రివిధ దళాల అధిపతులు సందర్శించారు. అయితే దీనికి ఒక ప్రత్యేకత ఉంది. ఆర్మీ చీఫ్, జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే, నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్ భదౌరియా, ఈ ముగ్గురు సర్వీస్ చీఫ్‌లు ఎన్డీయే 56వ కోర్స్‌మేట్‌లు. కాగా, ఆగస్ట్ 20 నుంచి 21 వరకు ఎన్డీయే పూర్వ కోర్స్‌మేట్ల సమావేశం ( అల్మా-మేటర్ టుగెదర్) జరిగింది. ఈ నేపథ్యంలో ఒకే బ్యాచ్‌కు చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు దీనికి హాజరయ్యారు.

అయితే, ఎన్డీయేలో ఒకే బ్యాచ్‌కు చెందిన వారు త్రివిధ దళాల అధిపతులు కావడం అరుదైన సంగతని, ఈ ముగ్గురు కలిసి అల్మా-మేటర్ టుగెదర్‌కు కలిసి హాజరుకావడం ఎంతో ప్రత్యేకమని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మరోవైపు ఎన్డీయేకు ఎంపిక కోసమే దేశంలో ఏర్పాటు చేసిన సైనిక స్కూళ్లలో బాలికలకు కూడా ప్రవేశం కల్పించాలని సుప్రీంకోర్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో త్రివిధ దళాల అధిపతుల ఎన్డీయే సందర్శన మరో ప్రాధాన్యత సంతరించుకున్నది.

# నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల, ఆగష్టు 21: : గ్రామీణ రోడ్ల నిర్మాణంలో ఇంజనీర్లు, గుత్తేదార్లు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. శనివారం మినీ పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో గ్రామీణ రహదారుల నిర్మాణంలో నూతన సాంకేతికత వినియోగించే విధానంపై నిర్వహించిన వర్క్ షాపులో జిల్లా కలెక్టర్ జి.రవితో కలిసి జడ్పీ చైర్ పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంజనీర్లు, గుత్తేదార్లు నూతన సాంకేతికత పట్ల అవగాహన పెంచుకొని, అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు రహదారులు ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు.

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రణాళికాబద్ధంగా జాతీయ ఉపాధి హమీ నిధులను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలో రైతు వేదికలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, నర్సరీ, మొక్కల పెంపకం వంటి వాటికి ఉపాధి హమీ నిధులు వినియోగించుకొని, గ్రామాలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సీఎం కేసిఆర్ ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం కల్పించి కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జి. రవి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కలుషితం చేసే పదార్థాలను వినియోగిస్తు, పర్యావరణ హితంగా ఇటీవలే పలు రోడ్లు నిర్మించారని, అటువంటి నూతన పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. మనం ప్రతి రోజు కొత్త కొత్త విషయాలను తెలుసుకోవాలని, అప్పుడే మంచి ఫలితాలు అందించగలుగు తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నాగం భూమయ్య, బత్తిని అరుణ పంచాయతీరాజ్ ఈఈ రెహ్మాన్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# హుజురాబాద్ లో ఇచ్చినట్టు.. కరీంనగర్ దళితులకు ఎందుకివ్వరు

## -సిటీ..యువజన కాంగ్రెస్ నాయకుల విమర్శ

కరీంనగర్ జూన్ 21(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ నియోజకవర్గంలోనీ దళితుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ నియోజకవర్గ

ఎస్సీ.. ఎస్టీలకు దళితబంధు ఇప్పించి..దళితులపట్ల ప్రేమ.. చిత్తశుద్ధి నిరూపించుకోవాలని యువజన, సిటీ కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. శనివారం ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము సునీల్.. సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలబద్రి శంకర్, దండి రవీందర్, యనమల మంజూల, కొరివి అరుణ్, కుర్ర పోచయ్యలతో కలిసి మాట్లాడారు. మాపార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి రెడ్డి నరేందర్ రెడ్డిపై మంత్రి గంగుల టిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులతో మాట్లాడించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిన్న ప్రెస్ మీట్లో మాట్లాడిన వారి కుటుంబాలతో పాటు కరీంనగర్ నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు ఇప్పించి న్యాయం చేయాలని మాత్రమే నరేందర్ రెడ్డి కోరడం జరిగిందన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి కేటాయించే బడ్జెట్ లో 18 శాతం నిధులు ఏ ఇతర శాఖలకు మళ్లించకుండా కేవలం ఎస్సీ.. ఎస్టీల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని అసెంబ్లీ వేదికగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకొచ్చి అమలు చేసిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. అటువంటి ప్రతిష్టాత్మకమైన చట్టాన్ని కేసీఆర్ తెలంగాణ స్వరాష్ట్రం లో తుంగలో తొక్కి.. ఎస్సీ..ఎస్టీల నిధులను కమిషన్ల కోసం దారి మళ్లించి దళిత, గిరిజనులను గత 7 సంవత్సరాలుగా ఆగం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామినైన అమలు చేసిందా టిఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీ నాయకులు గుండెలచేయి వేసుకొని ఆలోచించాలన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అమలు చేస్తున్న దళితబంధు కరీంనగర్ లో ఎందుకు కాకూడదని ప్రశ్నించారు. గత 7 సంవత్సరాలుగా దళితుల ఓట్లు దండుకొని పీఠమెక్కిన కేసీఆర్ దళిత, గిరిజనుల నోట్లో మట్టికొట్టిన పిదప హుజురాబాద్ ఉప ఎన్నికలు అయిపోయాక ఎట్లా అమలు చేస్తాడని.. కేసీఆర్ హామీలపై, మాటలపై ఎలా నమ్మకం కలుగుతుందన్నారు. అందుకే కరీంనగర్ కు దళితబంధు రావాలంటే రెండే మార్గాలు ఉన్నాయని ఒకటి గంగుల కెసిఆర్ ను ఒప్పించి కరీంనగర్ లో దళితబంధు ఇప్పించేలా చొరవ తీసుకోవాలని లేకుంటే బేషరతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గంగుల రాజీనామా చేస్తే కేసీఆరే..స్వయంగా కరీంనగర్ లో ఇంటింటికి వచ్చి దళితబంధు చెక్కులు ఇస్తాడని పేర్కొన్నారు. హుజురాబాద్ లో పైసలు..కరీంనగర్ లో దళితులకు కన్నీళ్లా ఇది నీకు న్యాయమేనా అంటూ గంగులను ఎద్దేవా చేశారు. హుజురాబాద్ లో టిఆర్ఎస్ అభ్యర్థి ని గెలిపించడానికి దళితబంధు ఇప్పిస్తూ ఇంటింటికి తిరుగుతున్న గంగుల కమలాకర్.. కరీంనగర్ లో ఓట్లేసి గెలిపించిన దళితులకు మాత్రం మొండి చేయి చూపడం సరికాదన్నారు. కరీంనగర్ లో దళితబంధు అమలు చేయిస్తే గంగులను గజ మాలతో మేమే సత్కరిస్తామన్నారు. మేడి మహేష్ ను ఒకటే అడుగుతున్న ఇన్ని రోజులు నువ్వు దళితులను అడ్డంపెట్టుకుని కరీంనగర్లో రాజకీయ పబ్బం గడుపుతున్న నువ్వు నిజంగా దళిత బిడ్డ అయితే దళితులందరూ బాగుపడాలని ఉంటే నీకు చేతనైతే నీకు దమ్ముంటే కరీంనగర్ దళిత బంధు ఇప్పమని మంత్రిగారి ని అడుగు దళితులు బాగుపడాలని లేదా? కరీంనగర్ లో దళిత బంధు వద్ద?..అని ప్రశ్నించారు. ప్రజలు గమనిస్తున్నారు నిన్ను నీ పార్టీని, ని మంత్రి ని ప్రజలు అందరూ బోందపేట్టె రోజులు దగ్గర పడ్డాయి. కరీంనగర్లో దళిత బంధు వచ్చేవరకు బరాబర్ మంత్రి గంగుల కమలాకర్ గారినీ రాజీనామా చేయమని అడుగుతం, ఊరు వాడ తిరుగుతం.. దళితులను చైతన్యం చేసి నీ ఇంటిని ముట్టడిస్తామని గంగులను హెచ్చరించారు. ఈకార్యక్రమంలో.. సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధీకొండ శేఖర్ బాబు, కార్యదర్శి కాంపెల్లి కీర్తి కుమార్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జీడీ రమేశ్, మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ అజ్మత్ పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ప్రతి దళితునికి దళిత బంధు అమలు చేయాలి

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ప్రతి దళితునికి దళితబంధు అమలుచేయాలని దళిత దండోరా ఈ కార్య నిర్వహణ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జ్ ప్రభాకర్ రెడ్డి ,కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ అన్నారు

కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో దళిత గిరిజన దండోరా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దళిత దండోరా కార్యనిర్వహణ వేములవాడ ఇంచార్జ్ ప్రభాకర్ రెడ్డి అలాగే వేములవాడ నియోజకవర్గఇంచార్జ్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు సీఎం పదవి అప్పచెప్పి తెలంగాణ రాష్ట్రానికి కాపలాగా ఉంటానని చెప్పి మోసపూరిత మాటలు మాట్లాడిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి కాలం చెల్లింది హుజురాబాద్ లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి దళిత కుటుంబానికి దళిత బందు అమలు చేయాలని దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తానని అలాగే డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తాం అని చెప్పి ఇవ్వకుండా మోసం చేసి అలాగే దళితులకు సబ్సిడి రుణాలు మంజూరు చేయకుండా దొంగ నాటకాలు చేస్తూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అని దుయ్యబట్టారు ఇట్టి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అకునూరి బాలరాజు చేపురి గంగాధర్ కచ్చ కాయల ఎల్లయ్య నాలుక సత్యం కర్రోల్ల భాస్కర్ బాలరెడ్డి మనుకా సత్యం. ఉప్పుల గంగయ్య శ్రీనివాస్ భాస్కర్ రావు అజీమ్ అగేష్ కమలాకర్ వెంగలి వెంకన్న లంబ రాజు మందాల లింబయ్య ప్రభాకర్ రెడ్డి వంగపెల్లి శోభన్ అనిల్ యాదవ్ కొమ్ము బాబు మ్యకల స్వామి మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# ఓడ్డెర కులస్తుల సమస్యలను పరిష్కరించాలి

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలోని ఓడ్డెర కులస్తుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబును కోరారు. శనివారం చందుర్తి మండల పర్యటనకు వెళ్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు కు సర్పంచ్ అంజి బాబు గ్రామంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వడ్డెర కాలంలో నిరుపేదలకు గృహాలు. వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని సర్పంచి ఎమ్మెల్యేను కోరారు,స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు,

# రైతు సంక్షేమానికి నిరంతరం కృషి- ఎమ్మెల్యే రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో రూపాయలు 22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్ కొనుగోలు చేసిఉచితంగా అందజేస్తున్నారు. రైతులకు విద్యుత్ తో పాటు. తాగునీరు. సబ్సిడీ విత్తనాలు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత కూడా ప్రభుత్వ తీసుకుంటుందన్నారు. రైతును రాజు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. మల్యాల గ్రామంలో దళితులకు దళిత బంధు పథకం అందజేస్తామన్నారు. అలాగే గ్రామంలో సిసి రోడ్లు. స్వశక్తి మహిళలకు రుణాలు అందజేస్తామన్నారు. అనంతరం చందుర్తి మండల కేంద్రంలో 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేదల ఆడపడుచుల్లో వెలుగు నింపేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకం ని చేపట్టారన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేదలకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. కళ్యాణ లక్ష్మి. కెసిఆర్ కిట్. గర్భిణీలకు పౌష్టికాహారం. ప్రసూతి సాయం అందించే ఆదుకుంటామన్నారు. అనంతరం పెరక కళ్యాణమండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పార్టీ అభివృద్ధి పై చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ. ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్. మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు. సింగిల్విండో చైర్మన్ లు తిప్పని శ్రీనివాస్. జలగం కిషన్ రావు. టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మరాటి మల్లిక్. తాసిల్దార్ నరేష్ అన్ని గ్రామాల సర్పంచులు. ఎంపిటిసిలు పాల్గొన్నారు.,

# లానెక్స్ తిరిగి 2021 ఆర్థిక సంవత్సరానికి గాను గైడెన్స్

హైదరాబాద్ , ఆగష్టు 21: ఇప్పుడు1 బిలియన్ యూరో మరియు1.05 బిలియన్ యూరోలమధ్య ఉంది. రెండవ త్రైమాసిక అమ్మకాలు 27.5శాతం పెరిగి 1.831 బిలియన్ల యూరోలకు చేరుకున్నాయి. ఇబిఐటిడిఎ ముందస్తు మినహాయింపులు 23.7 శాతం పెరిగి వార్షిక ప్రాతిపదికన 277మిలియన్ల యూరోలకు చేరుకున్నాయి. వృద్ధి మార్గంలో పయనిస్తుంది: ఎమరాల్డ్ కలమా కెమికల్ను స్వాధీనం చేసుకోవడం పూర్తయింది. ఒక మంచి ప్రయోజనాలను చేకూర్చిన రెండవ త్రైమాసికం తరువాత, లానెక్స్ మళ్లీ 2021 పూర్తి సంవత్సరానికి తన గైడెన్స్ ను పెంచింది. స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ ఇప్పుడు ఇబిఐటిడిఎ ముందస్తు మినహాయింపులు 1 బిలియన్ యూరో మరియు 1.05 బిలియన్యూరోల మధ్య ఉంటుందని అంచనా వేసింది. ఈ మార్గదర్శకంలో 2021 సంవత్సరం యొక్క మిగిలిన కాలంలో దాదాపు 35 మిలియన్ల ఇబిఐటిడిఎ సహకారంతో ఆగస్టు ప్రారంభంలో పూర్తయిన ఎమరాల్డ్ కలామా కెమికల్ కొనుగోలును ప్రతిబింబిస్తుంది. గతంలో, లానెక్స్ అంచనా ప్రకారం 950 మిలియన్ యూరోలు మరియు 1 బిలియన్ యూరోలు మధ్య ఆదాయాన్ని ఆర్జించింది. మహమ్మారి కుదిపేసిన మునుపటి సంవత్సర కాలంతో పోలిస్తే రెండవ త్రైమాసికంలో లానెక్స్ ఇబిఐటిడిఎ ముందస్తు మినహాయింపులను గణనీయంగా పెంచింది: ఆదాయాలు 224 మిలియన్ల యూరోలు నుండి 277 మిలియన్ల యూరోలకు 23.7 శాతం పెరిగాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ మెటీరియల్స్ విభాగం లాభపడడంతో ఆటోమోటివ్ పరిశ్రమ నుంచి పెరుగుతున్న బలమైన డిమాండ్ ద్వారా ఈ సానుకూల అభివృద్ధికి దారితీసింది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెగ్మెంట్ కూడా బలంగా అభివృద్ధి చెందింది, ఆదాయాలు దాదాపు మునుపటి సంవత్సరం అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. విక్రయ ధరలను సర్దుబాటు చేయడం ద్వారా అన్ని విభాగాలలో ముడి పదార్థాల ధరల అకస్మాత్తు పెరుగుదలను గ్రూపు ఎక్కువగా ఆమోదించింది. ఎక్స్ఛేంజ్ రేట్ ప్రభావాలు, ముఖ్యంగా యుఎస్ డాలర్ నుండి, అధిక సరుకు రవాణా ఖర్చులు మరియు గణనీయంగా అధిక ఇంధన వ్యయాలు, ముఖ్యంగా జర్మనీలో, ఆదాయాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపించాయి. గత సంవత్సరం త్రైమాసికంలో 15.6 శాతంతో పోలిస్తే, ఇబిఐటిడిఎ మార్జిన్ ముందస్తు మినహాయింపులు 15.1 శాతం ఉన్నాయి."రెండవ త్రైమాసికంలో మా వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతూనే ఉంది. వాల్యూమ్‌లు మహమ్మారి-ముందు స్థాయిలకు తిరిగి వచ్చాయి మరియు సంవత్సరం రెండవ సగం గురించి మాకు చాలా విశ్వాసం ఉంది. ఈ వేగం మరియు ఎమరాల్డ్ కలమా కెమికల్ ను విజయవంతంగా కొనుగోలు చేయడంతో, మేము మళ్లీ మా వృద్ధి మార్గాన్ని వేగవంతం చేయగలుగుతాము మరియు పూర్తి సంవత్సరానికి మా గైడెన్స్ ను పెంచగలుగుతున్నాము,"అని లానెక్స్ ఎజి బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ మాథియాస్ జాచెర్ట్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.